క్లుప్తంగా

సామూహిక కుంకుమ పూజలు

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి, భూదేవి సహిత మాధవస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. రాత్రి నిత్యహోమం, బలిహరణ, అర్చన, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బుధవారం జగజ్యోతి, శేషవాహనంపై స్వామి వారి ఊరేగింపు జరుగుతుందని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కలపటపు నవరంగ్ కిషన్ తెలిపారు.

వాసవీ మాతకు లక్ష మల్లెలతో సామూహిక పూజ



పెడన: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వాసవీ మాత జయంత్యుత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారికి 60 మంది మహిళలతో సామూహిక లక్ష మల్లెల పూజ నిర్వహించారు. సాయంత్రం లలితా పారాయణం, మహిళల కోలాటం జరిగాయి. అమ్మవారిని వీధులలో ఊరేగించారని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: మోపిదేవి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి పెదప్రోలుకు చెందిన మోర్ల వరప్రసాద్ కుమార్తె, ఇంటర్ విద్యార్థిని మోర్ల రుషిత వీణ రూ. 10,116 మంగళవారం విరాళంగా అందజేసింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆమెను అభినందించారు. విద్యార్థిని తాత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మురాల సుబ్బారావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలి

నాగాయలంక: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందించాలని డివిజినల్ అభివృద్ధి అధికారులు బి.సుబ్బారావు (గుడివాడ), కె.పద్మ (మచిలీపట్నం) అన్నారు. సచివాలయాల సేవలపై నాగాయలంక, కోడూరు మండలాల సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సకాలంలో సిబ్బంది హాజరు, ప్రోగ్రామ్‌లు, పథకాల అమలు విధానం, స్పందన, సర్వే తదితర అంశాలను వివరించారు. ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోడూరు ఎంపీడీఓ ఆకుల పాండురంగారావు, తహసీల్దార్లు జె.విమలకుమారి (నాగాయలంక), లతీఫ్ (కోడూరు), పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

నగరంలో 96.11 శాతం పింఛన్ల పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ రెండో రోజైన మంగళవారం 96.11 శాతం జరిగింది. జిల్లాలో నగరం ద్వితీయ స్థానంలో నిలిచింది. మొత్తం 18,588 పింఛన్లు ఉండగా 17,864 పింఛన్లను మంగళవారం సాయంత్రం 6.30 గంటల వరకు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ జి. చంద్రయ్య తెలిపారు.

సరస్వతీ దేవిగా కన్యకా పరమేశ్వరి దర్శనం



మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. సుప్రభాత సేవ, పూజ, సామూహిక కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, పూర్ణాహుతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. మల్లెపూలతో పుష్పార్చన చేసి మహిళలు సామూహిక సహస్ర నామ పారాయణం చేశారు. విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఉపాధి పనులు

మండవల్లి: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నవీన్ పేర్కొన్నారు. మండవల్లి మండలం కానుకొల్లు గ్రామంలో రూ.2.06 లక్షలతో చేపట్టిన పంట బోదె పనులను మంగళవారం ఉపాధి కూలీలు నిర్వహించారన్నారు. 107 మంది కూలీలు పనులు చేశారని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- రూ. 20 లక్షలతో ప్రధాన పార్కు అభివృద్ధి
- ఆకట్టుకుంటోన్న ఆటవస్తువులు, మ్యూజికల్ ఫౌంటేన్
- పెరుగుతున్న సందర్శకులు



పార్కులోని ఆట వస్తువులతో ఆడుకుంటున్న చిన్నారులు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు మునిసిపల్ ప్రధాన పార్కు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతోంది. పార్కును ఇటీవల సుమారు రూ. 20 లక్షలతో అభివృద్ధి చేశారు. గతంలో లేని ఎన్నో వసతులు, చిన్నపిల్లల క్రీడాపరికరాలను, ఏర్పాటు చేయడంతో సందర్శకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు అధిక సంఖ్యలో పార్కును సందర్శించి ఆహ్లాదంగా గడుపుతున్నారు.

సందర్శకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు

ప్రధాన పార్కులో సందర్శకులను ఆకట్టుకునేలా ఎన్నో ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పిల్లలు ఆడుకుంటూ సందడి చేస్తున్నారు. సందర్శకులు వీక్షించేందుకు పలురకాల పక్షులు, కోళ్లు, కుందేళ్లు, చేపలు, బాతులు వంటివి ఏర్పాటు చేశారు. పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన శివపార్వతులు, కృష్ణుడు, జలకన్య, జింకల బొమ్మలు వంటివి ఆకట్టుకుంటున్నాయి. స్వాగత ద్వారం వద్ద ఉన్న ఐ లవ్ మచిలీపట్నం పేరుతో ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు ఆకర్షిస్తోంది. మ్యూజికల్ ఫౌంటేన్‌లో సినిమా పాటలకు అనుగుణంగా నీటి ధారల విన్యాసాలు వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. సందర్శకులు సెల్ఫీలు దిగేందుకు పలు త్రీడీ చిత్రాలను గోడలపై చిత్రించారు. త్రీడీ చిత్రాల వద్ద సందర్శకులు సెల్ఫీలు దిగుతూ జ్ఞాపకాలను సెల్‌లలో బంధిస్తున్నారు.

ఉదయం, సాయంత్రం వేళల్లో కిటకిట..

వాకింగ్ ట్రాక్‌లో ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేవారు ఎక్కువగా వస్తున్నారు. వ్యాయామ పరికరాలు ఉండటంతో పలువురు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. ఈ వేసవిలో ఆటవిడుపుగా గడిపేందుకు సాయంత్రం వేళల్లో నగర ప్రజలు పెద్ద ఎత్తున పార్కుకు వస్తుండటంతో కిటకిలాడుతోంది. పార్కులో పలు రకాల మొక్కలతో పాటు పచ్చటి లాన్ ఉండటంతో సందర్శకులు కూర్చుని బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడుపుతున్నారు.



స్వాగత ద్వారం వద్ద జలకన్య, గోడపై త్రీడీచిత్రాలు



ఏర్పాట్లు బాగున్నాయి

పార్కులో చేసిన ఏర్పాట్లు ఎంతో బాగున్నాయి. గతంలో పార్కు నిర్వహణపై ఇంతగా దృష్టి పెట్టేవారు కాదు. ప్రస్తుతం పార్కును రంగురంగుల విద్యుత్ దీపాలతో, రంగులతో అభివృద్ధి చేశారు. సేద తీరేందుకు బెంచీలను ఏర్పాటు చేశారు. పార్కుకు వెళ్లి ఆనందంగా గడిపా.

– కమ్మిల విష్ణు, సందర్శకుడు



ఆనందాన్ని పంచుతున్నాయి

మునిసిపల్ ప్రధాన పార్కు అభివృద్ధి చేసిన తరువాత వసతులు బాగున్నాయి. పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదంగా ఉంటోంది. ముఖ్యంగా పిల్లలు ఆట వస్తువులు, కుందేళ్లు, పిట్టలు, బాతులను చూసి ఆనందంగా గడుపుతున్నారు. పెద్దలు పచ్చిక బయళ్లపై కూర్చుని సేద తీరుతున్నారు. పనులు లేని సమయంలో తాను పార్కుకు వచ్చి సేదతీరుతున్నా.

– పరసా రమేష్, సందర్శకుడు

జగనన్న కాలనీ నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో జగనన్న కాలనీల నిర్మాణ పురోగతిపై ఎంపీపీ వి. చినబాబు పలు ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె. స్వర్ణభారతి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయ స్థాయిలో ప్రతి రోజూ మండల స్థాయిలో 30 గృహాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈఈ మణికంఠ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేసుకునే వారికి మెటీరియల్‌గాని, నిధుల విడుదలలోగాని ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశల వారీగా బిల్లులు వ్యక్తి ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పారు. అధికారులందరూ కలిసి లబ్ధిదారులను చైతన్యపరచి వెంటనే బేస్‌మెంట్ వేసుకునే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం, వైఎస్సార్ కాంతి పథం అధికారులు తమ శాఖల నివేదికలు ఇచ్చారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ రాజేశ్వరి, ఏపీఎం డి. శ్రీను, ఏపీఓ ముత్యాలు, పలు గ్రామాల వీఓలు, బుక్ కీపర్లు, టీఏలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్చకుడికి ఆర్థిక సాయం



గూడూరు: కప్పలదొడ్డి శివాలయంలో అర్చకత్వం చేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న కనకం పంతులుకు కప్పలదొడ్డి హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. బాల్ బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు బి.ప్రభు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు రూ.11 వేలు, గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ పత్తిపాటి వీరబాబు రూ.2 వేలు వెరసి రూ.13 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు.

సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

గుడివాడ టౌన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, పెన్షనర్లు విధిగా తమ సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్‌ను లింక్ చేయాలని సబ్ ట్రెజరర్ కార్యాలయ అధికారి కె.రాబర్ట్ మోహన్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబర్‌కు ఉద్యోగుల ఐడీ, పెన్షనర్ ఐడీ అనుసంధానం చేయాలని సూచించారు. పెన్షనర్‌లు ఇంకా ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయలేదని ఈనెల 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. పెన్షనర్ల సౌలభ్యం కొరకు ఈ-కేవైసీ పూర్తి చేయుటకు గుడివాడ సబ్ ట్రెజరర్ కార్యాలయ పరిధిలో వారి సిబ్బంది సేవాకేంద్రాలు మూడు మండల హెడ్‌క్వార్టర్‌లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పెన్షనర్లు తమ ఆధార్ కార్డు, ఆధార్ అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను ఈ కేంద్రాలకు స్వయంగా గాని తమ ప్రతినిధుల ద్వారా గాని వచ్చి సీఎఫ్ఎంఎస్ ఐడీని అనుసంధానం చేసుకోవాలని సూచించారు. గుడివాడ, పెదపారుపూడి, ముదినేపల్లి, గుడ్లవల్లేరు, నందివాడ మండల పరిషత్ కార్యాలయాల్లోని ఉప ఖజానా కార్యాలయం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందిస్తామన్నారు. పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి..

మొవ్వ: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ పింఛన్‌దారులందరూ మే 10వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మొవ్వ ఉపఖజానా అధికారి టి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు తక్షణమే హెర్బ యాప్ సహకారంతో గానీ, ఉప ఖజానా కార్యాలయంలో నేరుగా సంప్రదించి సీఎఫ్ఎంఎస్ ఐడీకి ఆధార్ అనుసంధానం చేసిన మొబైల్ సహాయంతో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

రూ. 10 వేల కోట్ల వ్యాపారం లక్ష్యం

- సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆర్ఎం బ్రహ్మయ్య
- 5 న నాగాయలంకలో నూతన బ్రాంచ్ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్ఎం బ్రహ్మయ్య, శ్రీనివాస్ తదితరులు

నాగాయలంక: సప్తగిరి గ్రామీణ బ్యాంకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.10 వేల కోట్ల వ్యాపార లక్ష్యంతో అన్ని రంగాలకు విస్తృత బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ముందడుగు వేస్తోందని బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం నాగాయలంకలో పర్యటించిన ఆయన నూతన బ్రాంచ్ పనులను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన స్థానిక దీనదయాళపురం రోడ్డు లోని ఏబీజ ఎదురు కాంప్లెక్స్‌లో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ చేతుల మీదుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. కృష్ణా జిల్లాలో 95 బ్రాంచ్‌ల్లో ఇప్పటికే రూ.ఆరు వేల కోట్ల వ్యాపారం సాగిస్తోందన్నారు. గోల్డ్ లోన్స్, రైతు రుణాలు, చేపలు, రొయ్యల చెరువుల సంబంధిత రుణాలు, విద్యా రుణాలు, గృహ రుణాలు అందించడంతో పాటు వాణిజ్య బ్యాంకులలో లభ్యమయ్యే అన్ని సేవలు ఉంటాయని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయని, ఐదోవదిగా నాగాయలంక, త్వరలో ఆరవదిగా కోడూరులో బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్ఎం ఆఫీస్ చీఫ్ మేనేజర్ రాజా శ్రీనివాస్, బ్రాంచి మేనేజర్ బీజే విఠల్ విహారి, క్యాషియర్ కె.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఐదు వేల మందికి అన్నసమారాధన



ప్రత్యేక అలంకరణలో గోకర్ణేశ్వరుడు

కోడూరు: లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై కల్యాణమూర్తులను లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి గ్రామంలో ఊరేగించారు. ఉదయం గోకర్ణేశ్వరస్వామి వారి లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం వద్ద ఐదు వేల మందికి అన్నసమారాధన చేశారు. నక్కవానిదారి, లింగారెడ్డిపాలెం, మందపాకల, కోడూరు, జరుగువానిపాలెం, పోటుమీద గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ సుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

ఉయ్యూరు: గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గృహనిర్మాణాల పురోగతిపై మంగళవారం రాత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులు వేగంగా గృహాలు నిర్మించుకునేలా చైతన్యపర్చాలన్నారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం కింద రూ.లక్ష, స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేలు రుణం ఇస్తామన్నారు. లబ్ధిదారులతో నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఉయ్యూరు జగనన్న లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందన్నారు. 670కి పైగా ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలందరికీ ఇళ్లు కల్పించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలను అనుసరించి గృహ నిర్మాణాలు పూర్తికావటంతో పాటుగా, ప్రజలకు అవసరమైన వసతులను కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని వివరించారు. మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఏఈ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన భామాకలాపం నృత్య రూపకం

ఎలకుర్రు(పామర్రు): భ్రమరాంబ సమేత చెన్నమల్లికార్జునస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా రెండో రోజైన మంగళవారం రాత్రి నిర్వహించిన భామా కలాపం నృత్య రూపకం ఆహూతులను అలరించింది. ఈ భామాకలాపంలో సత్యభామగా పసుమర్తి శ్రీనివాస్ శర్మ తన అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించారు. మాధవునిగా పసుమర్తి వెంకటేశ్వరశర్మ నృత్యం చేశారు. నట్టువాంగం వేదాంతం రాధేశ్యామ్ సహకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ హరిదాసులు నాగమల్లేశ్వరి, సత్యనారాయణ భాగవతార్‌ల హరికథలు ఆలయంలో నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు కళాకారులను సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో జగజ్యోతి

మచిలీపట్నంటౌన్: గిలకలదిండిలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం రాత్రి ఆలయంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ బలగం విజయశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో జగజ్యోతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం బిందె తీర్థ గ్రహణ, స్వామివారికి అర్చన, నిత్య హోమాలు, బలిహరణ, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యార్చనలు, హోమాలు, బలిహరణ, శేషవాహనంపై ఊరేగింపు, పిల్లలచే మురళీ కోలాటం నిర్వహించారు.

నేడు గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

గుడివాడటౌన్: స్థానిక 6వ వార్డు, ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ విజయ గణపతి దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నారు. ది ఫిషర్‌మెన్ సొసైటీ యూత్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగనుంది. ఇందులో భాగంగా మంగళవారం శాంతి నిమిత్తం స్వామి వారి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శిఖర, కలశ, సహితాంగ, శ్రీ విజయ గణపతి విగ్రహాలకు అభిషేకాలు చేశారు. ప్రతిష్ఠా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి అభిషేకాలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వి.కొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మంగళవారం వి.కొత్తపాలెం సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రమేష్‌బాబు, యువ నేత వికాస్ స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వి.కొత్తపాలెం గ్రామంలోని 643 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తమకు అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయని, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా పథకాలను నేరుగా ఇంటికే పంపిస్తున్నారని గ్రామస్తులు రమేష్‌బాబు వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గతంలో పథకాలు రావాలంటే నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ బాధలు లేకుండా వలంటీర్లే ఇంటికి వచ్చి అన్ని సమస్యలను తెలుసుకుంటున్నారని గ్రామస్తులు చెప్పారు. అవినీతికి తావు లేకుండా అన్నివర్గాల వారికీ లబ్ధి చేకూరేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. నవరత్నాల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తమను మరోసారి ఆశీర్వదించాలని రమేష్‌బాబు కోరారు. రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని రమేష్ బాబు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణ, సచివాలయ కన్వీనర్ రేపల్లె లక్ష్మీకృష్ణవేణి, సర్పంచి యలవర్తి నాంచారయ్య, ఎంపీటీసీ బడే గంగాధరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆదిశేషయ్య, రైతు సంఘం నేత రేపల్లె రాజయ్య, ఎంపీడీఓ పాండురంగారావు, ఏఓ భానుప్రకాష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీమన్నారాయణుడి ఎదుర్కోలు ఉత్సవం



శ్రీమన్నారాయణుడి ఏకశిలా విగ్రహం

కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నవకలశస్నాపన ఉత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. అనంతరం శ్రీమన్నారాయణుడిని రాజకుమారుడిగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక పల్లకీలో దేవేరులను ఊరేగించుకుంటూ గ్రామంలోని రామాలయం వద్దకు తీసుకువెళ్లారు. స్వామివారి, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ ఎదుర్కోలు ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివార్లకు ప్రతి ఇంటి వద్ద హారతులు పడుతూ గ్రామస్తులు భక్తిభావం చాటారు. స్వామివారి 11 అడుగుల ఏకశిలా మూల మూర్తికి చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం ఉదయం ఆలయం ఆరుబయట స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని అష్టాక్షరీ స్వామీజీ తెలిపారు.

హద్దులు, ఉమ్మడి రహదారిపై విచారణ

పెడన: 20వ వార్డులో రైల్వేగేటు పక్కన స్థల వివాదంపై మంగళవారం అధికారులు విచారణ చేశారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారికి నడిచి వెళ్లేందుకు గతంలో ఉన్న మార్గం ప్రస్తుతం లేదని స్పందనలో ఫిర్యాదు చేశారు. రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు ర్యాంకు ఉద్యోగితో పాటు మచిలీపట్నం ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ పి. మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య తదితరులు మూసివేసిన మార్గం వద్ద మంగళవారం విచారణ చేశారు.

రైల్వే స్థలానికి అనుకుని ఉన్న తన సొంత స్థలంలో కూర్మ హిమగిరిరావు నిర్మాణం చేపట్టారు. అదే సమయంలో రైల్వే వారు డబ్లింగ్ పనులు చేపట్టడంతో రైల్వే స్థలంలో ఉన్న రోడ్డు మార్గం పూర్తిగా మూతపడింది. రైల్వే వారు ట్రాక్ పక్కన నడిచేందుకు కొంత జాగా ఉన్నా ఎటువంటి ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశంతో స్తంభాలు వేసి ఆ మార్గాన్ని పూర్తిస్థాయిలో మూసివేశారు. దీంతో ట్రాక్ పక్కనే నివాసం ఉంటున్న వారు మాకు రోడ్డు మార్గం లేదని, గతంలో ఉన్న దానిని మూసివేశారంటూ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పలు దఫాలుగా చర్చలు జరిపిన అధికారులు మంగళవారం తుది దశకు తీసుకువచ్చారు. కూర్మా హిమగిరిరావు రెండు అడుగుల స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడంతో వెనుక ఉండే వారికి నడకదారికి అవకాశం కల్పించారు. దీంతో అధికారులు, వెనుక ఉన్న నివాసితులు హిమగిరిరావును అభినందించారు. అధికారులతో పాటు ఆర్ఐ మణికుమార్, సర్వేయర్ కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోర్టు సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శీలం బాబ్జీ, కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 22వ తేదీన జరగనున్న పోర్టు పనులు ప్రారంభం, బహిరంగ సభ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు శీలం బాబ్జీ, చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని పలు డివిజన్లలో వారు మంగళవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బందరు ప్రాంత ప్రజల చిరకాల కోర్కెను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్థం చేసుకుని ఏకంగా పోర్టు పనులను ప్రారంభం చేస్తున్నందున నగరంలోని ప్రతి గడపకు వెళ్లి బహిరంగ సభకు రావాలని ఆహ్వానం పలకాలని చెప్పారు. పోర్టు పనులు ప్రారంభ కార్యక్రమాన్ని నగరంలో పండుగలా నిర్వహించాలని సూచించారు.

ప్రతిష్టామూర్తుల గ్రామోత్సవం

5న భావనారుషి దేవాలయ ప్రతిష్ట



ప్రతిష్టా మూర్తులను ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు

చల్లపల్లి: చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురం (పద్మశాలిపేట)లో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని నడకుదురు వద్ద కృష్ణానదిలో ప్రతిష్ట మూర్తులకు జలాధివాస మహోత్సవం జరిగింది. రేవు నుంచి ప్రతిష్టా మూర్తులను చల్లపల్లి మీదుగా భారీ ఊరేగింపుతో నూతన ఆలయానికి తీసుకువచ్చారు.

ప్రధాన కూడలిలో యువకులు డప్పు వాయిద్యాలతో సందడి చేస్తూ, జయజయ ధ్వానాల నడుమ ప్రతిష్టామూర్తులను ఆలయానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 10.49 గంటలకు నూతన ఆలయంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని పద్మశాలీయ బహోత్తమ సంఘం ప్రతినిధులు తెలిపారు.